క్లుప్తంగా

కోచ్ కోటేశ్వరరావుకు వీడ్కోలు



తెనాలి: స్థానిక చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడా స్టేడియం ఇన్‌చార్జి, వాలీబాల్ కోచ్ కాకర్ల కోటేశ్వరరావును ఆదివారం పలువురు అభినందించారు. మూడేళ్లుగా ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించిన ఆయన మూడు వాలీబాల్ కోర్టులను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం విజయవాడలోని 'శాప్' కార్యాలయంలో స్పోర్ట్స్ అధికారిగా బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో పలువురు ఆయనను సత్కరించి, వీడ్కోలు పలికారు. రాజేంద్రకుమార్‌రెడ్డి, అచ్యుత సాంబశివరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



తెనాలి: పట్టణానికి చెందిన శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి బస్ షెల్టరులోని చలివేంద్రంలో ఆదివారం మహా ప్రస్థానం సేవా సమితి ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ ప్రసాద్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, 3వ వార్డు కౌన్సిలరు ఆవుల కోటయ్య, 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత, కె.శ్రీగిరీష్, వి.ప్రవీణ్, కె.రాజేష్, రిమ్మనపూడి నరసింహారావు, కుర్రా యశ్వంత్‌కుమార్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కళాకారిణి భవానీకి సత్కారం



తెనాలి: ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటరులో ఆదివారం ఆఖరు చిత్రంగా 264వ సినిమా 'దాన వీర శూర కర్ణ'ను ప్రదర్శించారు. ప్రముఖ రంగస్థల నటి దేవరపల్లి భవానీని థియేటర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, సినీ నిర్మాత కొమ్మినేని వెంకటేశ్వరరావు, థియేటర్ యాజమాన్యం పెమ్మసాని పోతురాజులు సత్కరించారు. కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని వీరరాఘవరావు ప్రభృతులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ 100వ జయంతి కేక్‌ను థియేటర్ కమిటీ సభ్యులు కట్‌చేసి, శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి



మురళీకృష్ణారెడ్డి (ఫైల్)

కొల్లిపర: మండల పరిధిలోని తూములూరు గ్రామానికి చెందిన వీఆర్వో చాగంటి మురళీకృష్ణారెడ్డి(45) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ప్రస్తుతం మున్నంగి గ్రామ వీఆర్వోగా పని చేస్తున్నారు. మురళీకృష్ణారెడ్డి మృతదేహానికి తహసీల్దారు జి.నాంచారయ్య, డీటీ బాల కృష్ణారెడ్డి , సివిల్ సప్లయిస్ డీటీ మూర్తి, దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఈమని హరికోటిరెడ్డి, ఉప సర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు ఉయ్యూరు ఉమామహేశ్వరెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, వీఆర్వోలు నివాళులర్పించారు.

అలరించిన 'ఎన్టీఆర్ సూపర్ హిట్స్'



పాత గుంటూరు: ఎన్టీఆర్ జయంతి సందర్భంగా అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శ్రీశుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో 'ఎన్టీఆర్ సూపర్ హిట్స్ 'పేరున ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని విశేషంగా అలరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు, వెంకాయమ్మ పాల్గొన్నారు. ఎన్టీఆర్ నటించిన పలు చిత్రాలలోని మధురమైన పాటల్ని గాయకులు పురుషోత్తమ ప్రసాద్, చీకటి రవికాంత్, దొప్పలపూడి శ్రీనివాసరావు, పత్రి గాయత్రీదేవి, అత్తోట సౌజన్య ఆలపించారు. కార్యక్రమాన్ని సంస్థ సభ్యులు సిరిగిరి గణేష్, కమలికంటి వలి, కొయ్యలమూడి బాలస్వామి, తుమ్మేటి శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీనివాసరావు , పాగళ్ల మోహనరావు, డక్కుమళ్ల ఆదాము, మురళి పర్యవేక్షించారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

పట్నంబజారు: వడదెబ్బకు వ్యక్తి మృతిచెందిన ఘటనపై కేసు నమోదైంది. బాలాజీనగర్‌కు చెందిన కోసూరి నాగరాజు (44) శనివారం వడదెబ్బకు గురికావడంతో స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చూపించి ఇంటికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం బాగా ఇబ్బంది పడుతుండటంతో మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పాడి రైతులకు జగనన్న భరోసా

- పశువులు మరణిస్తే బీమా చెల్లింపు
- ఆవు, గేదెలకు రూ.30వేల పరిహారం
- మూడేళ్ల కాలానికి 20 శాతం ప్రీమియం



కొల్లిపర: రాష్ట్రంలో పాడి రైతులకు భరోసా ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వైఎస్సార్ పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. వివిధ రకాల వ్యాధులు, ప్రమాద వశాత్తు పశువులు, గేదెలు, ఎద్దులు, ఆవులు, గొర్రెలు, మేక వంటి వివిధ రకాల పశు సంపద అకారణంగా మరణిస్తే , పాడి రైతులు, కాపర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూరేలా బీమా పథకాన్ని రూపొందించారు. లబ్ధిదారుల వాటా కింద కేవలం 20 శాతం ప్రీమియం చెల్లిస్తే, మూడేళ్లపాటు చెల్లుబాటవుతుంది. నెలలపాటు కాలయాపన లేకుండా పశు, జీవ సంపద మరణించినా 21 రోజుల్లోపే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి పరిహారం జమయ్యేలా నిబంధన పెట్టారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల జమ కాకపోతే ఆ విషయాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉంచనున్నారు.

రకాన్ని బట్టి పరిహారం ఇలా..

సంకర జాతికి చెందిన పశువులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే ఒక్కో దానికి రూ.30 వేలు చొప్పున పరిహారం ఇస్తారు. దేశీయ పశుజాతి ఆవులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే వాటికి రూ.15 వేల చొప్పున చెల్లించనున్నారు. గొర్రెలు, మేకలు మరణిస్తే ఒక్కో దానికి రూ.6వేలు ప్రకారం ఇవ్వనున్నారు. ఒక్కో రైతు కుటుంబానికి బీమా కాలంలో ఐదు పశువులకు వర్తించనుండగా, 50 గొర్రెలు , మేకలకు వర్తిస్తుందని నిబంధన పెట్టారు. పాడి ఆవులు, గేదెలు కనీసం ఒక ఈత ఈని ఉండాలి. ఎద్దులు సంకరజాతివైతే ఒకటిన్నర సంవత్సరం నుంచి పదేళ్ల వయసున్నవి, అలాగే దేశీయ జాతి ఎద్దులు 2 నుంచి పదేళ్లు ఉన్నవి బీమా పథకానికి అర్హతగా నిర్దేశించారు. ఇక గొర్రెలు, మేకలు అయితే ఆరునెలల వయసు దాటి ఉండాలి, వయసును పశువైద్యాధికారలు ధ్రువీకరించనున్నారు. బీమా కింద నమోదయ్యే పశువులు, జీవాలకు చెవిపోగు వేస్తారు. దాన్ని బట్టి 21రోజుల్లోపు బీమా కంపెనీల నుంచి పరిహారం ఇవ్వనున్నారు.

బీమా వర్తింపు ఈ విధంగా....

- పశువులు ప్రమాదవశాత్తు మరణిస్తే అంటే వరదలు, తుపాన్లు, విద్యుత్‌షాక్, పాముకాటు, అడవి జంతువుల దాడి, మండల్లో చిక్కుకున్నవి, రహదారులు, రైల్వే ప్రమాదాల కారణంగా మృతి చెందిన వాటికి బీమా వర్తిస్తుంది.
- ఏదైనా రోగాలు, జబ్బులతో మరణించినా బీమా పథకానికి అర్హతగా గుర్తిస్తారు.
- యజమాని నిర్లక్ష్యం కారణంగా, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్(విపత్తులు వర్తించే పరిస్థితి ఉన్నప్పుడు) ఏదైనా ఇతర బీమా పథకాలు వర్తించినప్పుడు, దొంగతనాలకు, గుర్తింపు చెవిపోగు లేకుంటే బీమా పథకం వర్తించదు.

ప్రీమియం చెల్లింపుల్లో లబ్ధిదారుల వాటా ఇలా....

ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు తమ వాటా కింద 20శాతం , ఇతరులు అయితే 50శాతం ప్రీమియం చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు నిరుపేద రైతులు సంకర జాతి పశువులకు మూడేళ్ల కాలానికి తమ వాటా కింద ఒక్కో దానికి రూ.384 ప్రీమియం కట్టాలి, అదే దేశీయ పశుజాతికి అయితే తమ వాటా కింద రూ.480 చెల్లించాలి. ఇతర రైతులైతే సంకరజాతి పశువులకు తమ వాటా కింద రూ.960 చెల్లించాల్సి ఉంటుంది. ఇక గొర్రెలు, మేకలు అయితే ఒక్కో దానికి ఎస్సీ, ఎస్టీ పేద వర్గాలు తమ వాటా కింద ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్ల బీమాకు రూ,75 చెల్లించాలి. ఇతర వర్గాలు ఒక్కో దానికి ఏడాదికి రూ.90 , రెండేళ్లకు రూ.135 , మూడేళ్లకు రూ.187.50 ప్రకారం ప్రీమియం చెల్లించాలి. ఒక వేళ మరింత అధిక ధరకు బీమా చేయించుకోవాలంటే పశువు విలువను బట్టి ఎస్సీ, ఎస్టీ , పేదవర్గాలు 7.68 శాతం , ఇతర వర్గాలు 9.6 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఎక్కడికక్కడ పశువైద్యులు , పశుశాఖ అదికారులను సంప్రదించి బీమా పథకాన్ని పాడి రైతులు ఉపయోగించుకోవాలని పశు వైద్యులు తెలుపుతున్నారు.

పాడి రైతులు బీమాను వినియోగించుకోండి



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పాడి రైతుల కోసం పశుబీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక్కసారి బీమా కడితే మూడేళ్ల బీమా వర్తిస్తుంది. గతంలో మాదిరి కాకుండా పాడిపశువు చనిపోయినట్లయితే 21 రోజుల్లోనే యజమాని ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.దీంతో పాటు గొర్రెలు, మేకలకు బీమా ఉంది. గత రెండు రోజులు నుంచి బీమా నమోదు చేస్తున్నాం ఈ అవకాశాన్ని పాడి రైతులు, పశువుల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ సాయి సతీష్‌రాజు, పశువైద్యాధికారి, కొల్లిపర.

నేడు వంటీర్లకు వందనం కార్యక్రమం

కొల్లిపర: ప్రభుత్వం వలంటీర్ల సేవలను గుర్తిస్తూ నిర్వహిస్తున్న వంటీర్లకు వందనం కార్యక్రమం కొల్లిపర గ్రామంలోని కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొల్లిపరలోని సచివాలయాలు 1, 2, 3, మున్నింగిలోని సచివాలయాలు 1, 2, వల్లభాపురంలోని సచివాలయాలు 1, 2, పిడపర్రు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సన్మానిస్తారని చెప్పారు. గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

సిటీ ఎలక్ట్రానిక్స్, టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ కార్యవర్గం

నెహ్రూనగర్: గుంటూరు సిటీ ఎలక్ట్రానిక్స్, టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అరండల్‌పేటలోని ఓ ఫంక్షన్ హాలులో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ఎస్‌కె. అజాజ్ అలీ, సెక్రటరీగా ఈ. శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కె. మెహబూబ్ బాషా, ట్రెజరర్‌గా బి. శ్రీనివాసరావు, కమిటీ సభ్యుడిగా కుర్రా రాజేష్‌ను ఎన్నుకున్నారు.

మోదీ మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 101వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక చంద్రమౌళీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రముఖ సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గొప్పతనాన్ని ప్రధాని మన్ కీ బాత్‌లో ప్రస్తావించడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ మహోన్నత వ్యక్తిత్వం కలవారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలపాటి రవికుమార్, తాడువాయి నాగరామకృష్ణ, భీమినేని చంద్రశేఖర్, కోలా రేణుకాదేవి, ఈదర శ్రీనివాసరెడ్డి, వెలగలేటి గంగాధర్, కుమార్ గౌడ్, పాండురంగ విఠల్, కన్నెగంటి శ్రీనివాస్, దేసు సత్యనారాయణ, పార్లమెంట్ విస్తారక్ రమేష్ పాల్గొన్నారు.

నీట్‌పై ఉచిత శిక్షణ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: నీట్‌పై విద్యార్థినులకు జూన్ 3,4,5 తేదీల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మెటా మైండ్ నీట్ అకాడమీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ దోమలగూడలోని రామకృష్ణ మఠం పక్కనున్న అకాడమీలో ప్రత్యేకంగా బాలికల కోసం ఉచిత హాస్టల్ వసతితో నిర్వహించే శిక్షణ తరగతుల్లో భాగంగా నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, టెస్ట్ సిరీస్, నూతన ప్రిపరేషన్ విధానం ద్వారా మెరుగైన ర్యాంకు సాధనపై సీనియర్ అధ్యాపకులు, విషయ నిపుణులతో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థినులంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 85229 58575, 70322 64910 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

రుతుస్రావంపై అవగాహన సదస్సులో మున్సిపల్ చైర్ పర్సన్ ఖలేదా నసీమ్



ర్యాలీలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి: మహిళలు ఆరోగ్యంపై తప్పనిసరిగా శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ సూచించారు. అంతర్జాతీయ రుతుస్రావ దినోత్సవం ఆదివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపాలిటీ మెప్మా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలకు రుతుస్రావంపై అవగాహన కల్పించారు. రుతుస్రావం సమయంలో మహిళలు కొందరు ఇప్పటికీ సంప్రదాయ ఆలోచనల బాధితులుగా ఉండటం విచారకరమన్నారు. ఇప్పటికీ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై కొందరికి అవగాహన లేకపోవటంపై ఆందోళనకరమన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత లేకుంటే ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో మెప్మా సిబ్బంది ఇదే అంశంపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు డాక్టర్ బీబీజాన్, డాక్టర్ హరిణిలు రుతుస్రావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కర పత్రాలను పంచారు. మెప్మా సీఎంఎం వి.మాధవరావు, అరుణకుమారి, సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులకు, ప్రజా ప్రతినిధులకు సత్కారం



విద్యార్థిని తేజశ్వినీకి నగదు ప్రోత్సాహం అందజేస్తున్న సంఘ నేతలు

తెనాలి: యాదవ ఎంప్లాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గంలో పదో తరగతి ఉత్తీర్ణులైన యాదవ విద్యార్థులను నగదు ప్రోత్సాహకాలను ప్రదానం చేసి, సత్కరించారు. అలాగే తెనాలి, పరిసరాల్లోని యాదవ ప్రజా ప్రతినిధులను సన్మానించారు. రైల్వే స్టేషను రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగిన సభకు.. ఫౌండేషన్ ఆర్గనైజరు ఎనికపల్లి అంబరీషుడు అధ్యక్షత వహించారు. మొత్తం 43 మంది విద్యార్థులకు నగదు అతిథులు చేతుల మీదుగా అందజేశారు. తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష స్వరూపరాణి, తెనాలి కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, తాడిబోయిన రాధిక, తోట రఘురాం, తాడిబోయిన రామయ్య, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, కుర్రా సుజాత, కో–ఆప్షన్ సభ్యుడు బచ్చనబోయిన శ్రీనివాసరావు, చింతలపూడి సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ, అత్తోట సర్పంచ్ దేశబోయిన నాగ బసవేశ్వరరావును సత్కరించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, డాక్టర్ తాడిబోయిన అఖిలేష్, డాక్టర్ తాడిబోయిన అవినాష్, డాక్టర్ ఎనికపల్లి అనిల్‌కుమార్, డాక్టర్ నల్లమేకల శివరామకృష్ణ పాల్గొన్నారు. డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చారు. గడవర్తి సుబ్బయ్య, దొడ్డక సాంబశివరావు, ఫౌండేషన్ ప్రతినిధులు కేదార్‌నాథ్, శ్రీనివాస పండిట్, మీసాల బాలాజీ, కాటుపల్లి శ్రీనివాసు, కొత్తగొర్ల శ్రీనివాస్, బ్రహ్మేశ్వరరావు, ఏసుబాబు, తాడిబోయిన రమేష్‌బాబు, తోట రాజారావు, కుర్రా విజయలక్ష్మి పర్యవేక్షించారు.

'కర్మయోగి' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మాజీ ఎంపీలు శోభనాద్రీశ్వర రావు, యలమంచిలి శివాజీ తదితరులు

పాత గుంటూరు: భారతీయ సనాతన వైదిక జీవన విధానానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచి తమ జీవితాల్ని సార్థకం చేసుకున్న నిజమైన నిష్కామ కర్మయోగులు బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులని మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధ్యాన మందిరంలో తెనాలి పావులూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ ఆదర్శ జీవన యానం లఘు చిత్ర ప్రదర్శనతో పాటు ఆయనపై రాసిన 'కర్మయోగి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పాల్గొన్నారు. యలమంచిలి శివాజీ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల బొల్లేపల్లి సత్యనారాయణ దంపతుల ఆధ్యాత్మిక, ధార్మిక జీవనం వర్తమాన సమాజానికి ఆదర్శనీయమని కొనియాడారు. సభను పావులూరి ట్రస్ట్ చైర్మన్ పావులూరి శ్రీనివాసరావు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బొమ్ము ఉమామహేశ్వరరావు, వెంపటి సత్యనారాయణ, డాక్టర్ డి.ఎస్. దీక్షిత్, డాక్టర్ కోగంటి రంగనాయకి, కూర్మనాథస్వామి, పారిశ్రామికవేత్తలు చుక్కపల్లి రమేష్, బలరామకృష్ణయ్య, సామినేని కోటేశ్వరరావు, వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

శబ్ద సాధన.. గొప్ప వ్యాయామం

సంగీత విద్వాంసుడు 'కలైమామణి' తాడేపల్లి లోకనాథశర్మ



లోకనాథశర్మ దంపతులను సత్కరించిన అసోసియేషన్ నేతలు

తెనాలి: నాదానికి గల శక్తి గొప్పదని, శబ్దసాధన గొప్ప వ్యాయామంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు 'కలైమామణి' బ్రహ్మశ్రీ తాడేపల్లి లోకనాథ శర్మ అన్నారు. నాదంతో శరీరంలోని అన్ని భాగాల్లో కంపనలు వస్తాయని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సభలో సంగీతం–సాహిత్యం అంశంపై లోకనాథశర్మ మాట్లాడారు. సంగీతంలో ప్రతి అక్షరానికి ఒక ధ్వని ఉంటుందన్నారు. ఆ ధ్వని ఇచ్చినపుడు రాగరంజితం అవుతుందని చెప్పారు. ధ్వని, స్వర, లయ, పద భ్రంశాలు చెందటమే, ప్రకృతి వైపరీత్యాలకు కారణమని వ్యాఖ్యానించారు. అపభ్రంశం ఆగేవరకు అవి వస్తూనే ఉంటాయని తెలిపారు. త్యాగరాజు, రామదాసు వంటి వాగ్గేయకారుల సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని, మననం చేసుకుంటే చాలని చెప్పారు. ఆయా కీర్తనలను ఆలపిస్తూ, అర్థాలను విడమరిచి చెప్పారు. తొలుత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొవ్వా సత్యనారాయణ, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, సంఘ సభ్యులు లోకనాథ శర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. గత నెలలో మృతిచెందిన జీవితకాల సభ్యులు డాక్టర్ పసుపులేటి వెంకటరమణ, వీడీఆర్ మనోహర్, ధూళిపాళ్ల కృష్ణారావుకు నివాళులర్పించారు.

కవుల సందేశాల్ని పట్టించుకోని సమాజం

అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్



వల్లూరు శివప్రసాద్‌ను సత్కరిస్తున్న కలిమిశ్రీ , సంఘ సభ్యులు

పాత గుంటూరు: కవులు చెప్పే నీతి వాక్యాల్ని, సందేశాల్ని పట్టించుకునే స్థితిలో నేటి సమాజం లేదని, ఈ విషయాన్ని రచయితల సంఘాలు గుర్తించి అందుకు పరిష్కార మార్గాల్ని అన్వేషించాలని అరసం రాష్ట్ర కార్యదర్శి, సుప్రసిద్ధ నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం, డాక్టర్ పట్టాభి కళాపీఠం ఆధ్వర్యంలో 'కవి మిత్రుల కలయిక–కవి సమ్మేళనం' నిర్వహించారు. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సభలో ముఖ్య అతిథిగా వల్లూరు శివప్రసాద్ పాల్గొన్నారు. డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు గుంటూరుతో ఉన్న అనుబంధాన్ని సభికులతో పంచుకున్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ సాహితీ సంఘాల విస్తరణకీ, చీల్చివేతకు తేడా తెలియని అజ్ఞానం సాహితీ రంగాన్ని పట్టి పీడిస్తోందని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ జోస్యుల కృష్ణబాబు రచించిన కాళ్లకూరి నారాయణరావు నాటకత్రయ సమాలోచనం పుస్తకాన్ని రచయిత వై.హెచ్.కె.మోహన్‌రావు సమీక్షించారు. కవి సమ్మేళనంలో గోలి హనుమశాస్త్రి, వెదుళ్లపల్లి సాంబశివరావు, సోపాటి ప్రభాకర్, దుర్గం సునీత, గడల శివప్రసాద్, తాటికోల పద్మావతి, డాక్టర్ కుమారస్వామి, బ్రహ్మాంజలి కవితాగానం చేశారు. అనంతరం వల్లూరు శివప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రావి రంగారావు, కందిమళ్ల శివప్రసాద్, శరత్ ప్రమోద్ ఎల్వీ, దినవహి సత్యవతి, గోలి విజయ, బి. జనార్దనరెడ్డి, బండికల్లు జమదగ్ని పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సయ్యద్ జానీ బాష, చొప్పా రాఘవేంద్ర శేఖర్ నిర్వహించారు.

ఉద్యోగోన్నతులను మాన్యువల్ కౌన్సెలింగ్‌లో నిర్వహించాలి



ఏడీ నిర్మలారాణికి వినతి పత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగోన్నతుల్ని మాన్యువల్ కౌన్సెలింగ్‌లో నిర్వహించాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎం. కళాధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫ్యాప్టో రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఆదివారం ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధ నిర్ణయాల్ని సవరించాలని కోరుతూ డీఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతుల విషయంలో విద్యాశాఖ నిర్దిష్ట విధానాన్ని పాటించకుండా గందరగోళం సృష్టించడం తగదని పేర్కొన్నారు. ఉద్యోగోన్నతులకు ఖాళీల్ని చూపించకుండానే అంగీకారం కోరడం వల్ల ఎక్కువ మంది తిరస్కరిస్తున్నారని తెలిపారు. ఫ్యాప్టో కో–చైర్మన్ జి. మోహన్‌రావు మాట్లాడుతూ బదిలీలపై సంఘాలతో జరిపిన చర్చల్లో అంగీకరించిన విషయాలు ఉత్తర్వుల్లో లేవన్నారు. ఉత్తర్వుల్లో పొందుపర్చిన అంశాలు ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో లేవని పేర్కొన్నారు. ఫ్యాప్టో నాయకుడు కె. బసవ లింగారావు మాట్లాడుతూ ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాలు, ఖాళీల్ని ముందుగా చూపి, మాన్యువల్‌గా నిర్వహిస్తే ఎటువంటి సమస్య ఉండదని తెలిపారు. బదిలీల ప్రభావం ఉపాధ్యాయులపై ఎనిమిదేళ్లు ఉంటుందని, ప్రక్రియ సక్రమంగా జరగని పక్షంలో ఎనిమిదేళ్లు నష్టపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. పోస్టుల్ని బ్లాక్ చేయరాదని కోరారు. అనంతరం డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. నిర్మలారాణికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బి. ఆదిలక్ష్మి, నరసింహారావు, ఖాలీద్, సీహెచ్. నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని సత్కరిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని కెనడీ నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, ఎం.వి. రామచంద్రారెడ్డి, వి. చంద్రశేఖర్‌రెడ్డిని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర నాయకుడు పి. మాల్యాద్రి, ఆర్. చలపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ నాయకులు కె. మురళి, ఎస్. రామాంజనేయులు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ. ఖాసీం, ఉపాధ్యాయులు హసన్ బేగ్, యలమందరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ నజీరుద్దీన్

గుంటూరు మెడికల్: హోప్ విన్ హాస్పిటల్స్, యువ నారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రెడ్డిపాలెం మదర్ థెరిస్సా కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు ఉచితంగా చేసి 300 మందికి మందులు కూడా అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, హోప్‌విన్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ ప్రతినెలా హాస్పిటల్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ వీటిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. హాస్పిటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, మారుతీరావు, బాబు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన ఉంటుందన్నారు. వేసవి దృష్ట్యా ఉదయం 8.30 గంటలకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి రోజు సచివాలయాల్లోనూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా అక్కడ కూడా అర్జీల్ని అందజేయవచ్చని అదనపు కమిషనర్ తెలియజేశారు.

నేడు ఎన్టీఆర్ స్మారక పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: ఎన్టీఆర్ శత జయంతి పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై సోమవారం సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో పలువురు విశిష్ట వ్యక్తులకు ఎన్టీఆర్ స్మారక పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు యువ కళావాహిని సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సభలో ప్రముఖ నాటక రచయిత వల్లూరు శివప్రసాద్, సినీ నటులు ఆలపాటి లక్ష్మి, గోపరాజు రమణ, డాక్టర్ పి.వి.ఎస్.కృష్ణకు పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సభ అనంతరం 'నాన్న నేనొచ్చేస్తా' సాంఘిక నాటిక ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొనాలని ఆయన కోరారు.